క్లుప్తంగా

ఉత్తమ బోధన అందించాలి



విద్యార్థులతో మాట్లాడుతున్న ఎంపీడీవో కాళీప్రసాద్

హిరమండలం: విద్యార్థులకు ఉత్తమ విద్యాబోధన అందించాలని ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్ సూచించారు. మంగళవారం లోకొండ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా పరిశీలించారు. విద్యాబోధన తీరును అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం పెట్టాలని సూచించారు. విద్యా బోధన విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం వద్దన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో గోవిందరావు, ఉపాధ్యాయ సిబ్బంది ఉన్నారు.

ఎరువుల షాపుల్లో తనిఖీలు



తనిఖీలు చేపడుతున్న విజిలెన్స్ బృందం

నరసన్నపేట: మండల కేంద్రంలోని ఎరువుల హోల్‌సేల్, రిటైల్ షాపుల్లో విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు మంగళవారం తనిఖీలు చేపట్టారు. పలు రికార్డుల్లో తేడాలు ఉండడంతో రూ.4.04 లక్షల విలువైన 571 లీటర్లు కలుపు మందులు సేల్స్ నిలుపుదల చేస్తూ ఆదేశాలు జారీ చేశారు. విజిలెన్స్ సీఐ అదారి సంతోష్ ఆధ్వర్యంలో తనిఖీలు చేపట్టారు. స్టాక్ రిజిస్టర్, నిల్వలు, ధరలు, నాణ్యత వంటి వాటిపై దృష్టిపెట్టి తనిఖీలు చేశారు. తనిఖీల్లో ఏడీ విజయప్రసాద్, డీఏవో ఆఫీస్ ప్రతినిధి ఏడీఏ సీహెచ్ వెంకటరావు, ఏఈవోటీ సంతోష్‌కుమార్, వ్యవసాయాధికారి సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు పంపిణీ



యూరియా పంపిణీ చేస్తున్న దృశ్యం

బూర్జ: మండలంలోని వైకుంఠపురం రైతుసేవా కేంద్రంలో రైతులకు యూరియాను మంగళవారం పంపిణీ చేశారు. అనంతరం రైతులకు ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన సలహాలు అందజేశారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ బొడ్డేపల్లి వెంకటసత్యం, గ్రామ పెద్దలు, వ్యవసాయ రైతులు తదితరులు పాల్గొన్నారు.

పశు వైద్యశాలలో ఆకస్మిక తనిఖీలు



రికార్డులు పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్ నరసింహం

మెళియాపుట్టి: పాడి పశువుల ఆరోగ్యానికి పటిష్ట చర్యలు తీసుకోవాలని, వాటికి సంబంధించిన మందుల స్టాక్ ఉంచుకోవాలని టెక్కలి డివిజన్ పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ చందక నరసింహం సూచించారు. స్థానిక పశువుల ఆస్పత్రిని మంగళవారం తనిఖీ చేశారు. మందులు, సిబ్బంది హాజరుకు సంబంధించిన రికార్డులు పరిశీలించారు. ఆస్పత్రిలో పరిశుభ్ర వాతావరణం ఉండేలా చూసుకోవాలన్నారు. పశువుల ఆరోగ్యంపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. కార్యక్రమంలో వైద్యాధికారి అనిల్, పలువురు సిబ్బంది ఉన్నారు.

విద్యార్థులకు సైకిళ్లు అందజేత



సైకిళ్లు అందజేస్తున్న దృశ్యం

నరసన్నపేట: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న 8 మంది పేద విద్యార్థులకు వసుదైక కుటుంబం యూనివర్సల్ ఫ్యామిలీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం సైకిళ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంఈవో దాలినాయుడు ఫౌండేషన్ ప్రతినిధులను అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి అభినందనలు



ఇంద్రజను సత్కరిస్తున్న దృశ్యం

మెళియాపుట్టి: స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలకు చెందిన రాజాన ఇంద్రజ ట్రిపుల్ ఐటీకి ఎంపికైంది. దీంతో విద్యార్థినిని పాఠశాల ఆవరణలో మంగళవారం సత్కరించారు. రానున్న రోజుల్లో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మహాలక్ష్మి, పీఎంసీ చైర్మన్ బూరగాన చినబాబు, విద్యార్థుల తల్లిదండ్రులు వెంకటరావు, పార్వతి తదితరులు పాల్గొన్నారు.



మహేంద్రతనయ నదిలో పడవ ప్రయాణం చేస్తున్న జిల్లేడుపేట గ్రామస్తులు

ఎన్నాళ్లీ వేదన..!

- దశాబ్దాలుగా వంతెన సౌకర్యానికి నోచుకోని జిల్లేడుపేట
- నదిలో ప్రయాణంతో ఇబ్బందులు
- చదువులకు దూరమవుతున్న విద్యార్థులు

హిరమండలం: ఊరు దాటాలంటే నదిని దాగాలి. చదువుకోవాలంటే సాహసం చేయాలి. అనారోగ్య మొస్తే భగవంతుడి మీదనే భారం వేయాలి. మండలంలోని కల్లట పంచాయతీ పరిధి జిల్లేడుపేట గ్రామం పరిస్థితి ఇంది. ఈ గ్రామానికి మూడు వైపులా మహేంద్రతనయ జలాలు, ఇంకోవైపు పంట పొలాలు ఉంటాయి. అయితే గ్రామం నుంచి పంట పొలాలు దాటాలంటే రోడ్డు లేదు. మహేంద్రతనయపై రావాలంటే వంతెన లేదు. దీంతో ఈ గ్రామస్తులు వర్షాకాలంలో పడే బాధలు వర్ణనాతీతం. ఈ సమయంలో ఎవరైనా అనారోగ్యానికి గురైనా, పురిటి నొప్పులతో బాధపడినా ఆస్పత్రికి వెళ్లేందుకు నానా అవస్థలు పడాల్సిన పరిస్థితి ఉంటుంది. ప్రస్తుతం గ్రామంలో పదుల సంఖ్యలో విద్యార్థులు 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు అవలంగి, హిరమండలం, పాతపట్నంలో చదువుతుంటారు. అయితే సరైన రహదారి సౌకర్యం లేకపోవడంతో వారుపడే బాధలు అన్నీ ఇన్ని కావు. విద్యార్థులంతా నది ఇవతలకు సైకిళ్లను చేర్చి తోటలో ఉంచుతుంటారు. అక్కడనుంచి ప్రమాదకర పరిస్థితుల్లో పడవపై ప్రయాణించి గమ్యస్థానాలకు చేరుకుంటారు.



పడవలో రేషన్ సరుకులు తీసుకెళ్తున్న గ్రామస్తులు

వంతెనకేదీ మార్గం..?

ఇక్కడ వంతెన నిర్మించాలన్న డిమాండ్ దశాబ్దాలుగా ఉన్నా కార్యరూపం దాల్చడం లేదు. సరిగ్గా 2014 ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో అప్పటి మంత్రి శత్రుచర్ల విజయరామరాజు వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కానీ అది ముందుకు సాగలేదు. అనంతరం 2018లో అప్పటి టీడీపీ ప్రభుత్వం కూడా మరోసారి వంతెన నిర్మాణానికి శంకుస్థాపన చేసింది. చాలా రకాలుగా హడావుడి చేసింది. కానీ కనీస స్థాయిలో కూడా పనులు చేయకుండా చేతులెత్తేసింది. తదుపరి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం దీనిపై ప్రత్యేకంగా దృష్టిపెట్టింది. కానీ ఇంతలో సాంకేతిక సమస్యలు ఎదురయ్యాయి. గత అనుభవాల దృష్ట్యా ముందున్న ప్రభుత్వ చర్యలు పుణ్యమా అని కాంట్రాక్టర్లు ముందుకు రాలేదు. దీంతో నిధులు మంజూరు చేసినా ఫలితం లేకపోయింది. అయితే తాము అధికారంలోకి వస్తే జిల్లేడుపేట వద్ద వంతెన నిర్మాణం చేపడతామని స్థానిక ఎమ్మెల్యే మామిడి గోవిందరావు ఎన్నికల ప్రచారంలో హామీ ఇచ్చారు. ఆ హామీని అమలు చేయాలని గ్రామస్తులు ఇప్పుడు కోరుతున్నారు.

నిత్యం ఇబ్బందులే



ప్రమాదకర స్థితిలో మహేంద్రతనయ నదిని దాటుతున్నాం. ఒక్కోసారి పడవ ప్రయాణంలో ఏమవుతుందో తెలియదు. నదిలో నీటి ఉధృతి అధికంగా ఉండే సమయంలో ఇబ్బందులు తప్పవు. ఆ సమయంలో గ్రామానికే పరిమితం కావాల్సి ఉంటుంది. వంతెన లేకపోవడంతో పిల్లల చదువులకు కూడా ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

– రావాడ అమ్మన్న, జిల్లేడుపేట,హిరమండలం

తలరాత మారడం లేదు



వర్షాకాలంలో మా అవస్థలు వర్ణించలేనివి. ఒక్కోసారి మూడు నెలలకు ఒకసారి రేషన్ తీసుకోవాల్సిన పరిస్థితులు దాపురిస్తాయి. ప్రభుత్వాలు మారుతున్నాయే తప్ప.. మా తలరాతలు మారడం లేదు. ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం దృష్టిపెట్టాలి. వంతెన నిర్మాణం పూర్తి చేయాలి.

– కొర్ను ధనుంజయరావు, జిల్లేడుపేట, హిరమండలం

మోసాలతోనే ఏడాది పాలన



రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో క్యూ ఆర్ కోడ్ పోస్టర్ల ఆవిష్కరణ

- మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి
- సవర ముకుందాపురంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ'

మెళియాపుట్టి: ఏడాది కాలంగా కూటమి ప్రభుత్వం ప్రజలను మోసం చేస్తూనే పాలన సాగిస్తోందని పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి అన్నారు. మండలంలో ముకుందాపురం పంచాయతీలోని సవర ముకుందాపురం గ్రామంలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రీ కాలింగ్ చంద్రబాబు మ్యానిఫెస్టో క్యూ ఆర్ కోడ్ పోస్టర్లు ఆవిష్కరించారు. కూటమి నాయకులు అధికారంలోకి రావడానికి ప్రజలను అబద్ధపు హామీలతో మోసం చేశారని మండిపడ్డారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఇంటింటికీ రేషన్ సరుకులు అందిస్తే, ప్రస్తుతం రేషన్ డీలర్ల వద్దకు సుదూర ప్రాంతాలకు వెళ్లి తీసుకోవాల్సిన పరిస్థితి కల్పించారని మండిపడ్డారు. సవర ముకుందాపురం గ్రామం నుంచి 7 కిలోమీటర్ల దూరంలో ఉన్న సుందరాడ గ్రామానికి రేషన్ కోసం వ్యయ, ప్రయాసలు కూర్చి వెళ్తుండడం బాధాకరమన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో గిరి శిఖర గ్రామాలకు సైతం ఇంటి వద్దకే పెన్షన్, రేషన్, వైద్య సదుపాయాలు అందించామని తెలియజేశారు. అలాగే ఇప్పటివరకు రైతులకు చిల్లిగవ్వ కూడా ఈ ప్రభుత్వం అందించలేదని మండిపడ్డారు. ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నవారిపై కేసులు పెడుతున్నారని, అటువంటి కేసులకు భయపడేది లేదని స్పష్టం చేశారు. మరోసారి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ముఖ్యమంత్రిని చేసుకునేందుకు కృషి చేయాలని పార్టీ నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో ఎంపీపీ రాణా ఈశ్వరమ్మ, మండల కన్వీనర్ పోలాకి జయమునిరావు, పరశురాంపురం సర్పంచ్ సవర లీలారాణి, పద్ద సర్పంచ్ రామచంద్ర మజ్జి, ఆంపురం సర్పంచ్ జమ్మయ్య, కో–ఆప్షన్ సభ్యుడు భాస్కర్‌దాస్, నాయకులు సవర భాస్కరరావు, సీయాకు రాజారావు, పరపటి యోగీశ్వరరావు, మణికంఠ, నక్కల కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పాతపట్నం మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి

'బాబు ష్యూరిటీ - మోసం గ్యారెంటీ' సమావేశం నేడు

బూర్జ: మండలంలో కొల్లివలస గ్రామంలోని సాయిబాబా మందిరం వద్ద బుధవారం సాయంత్రం 3 గంటలకు బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ సమావేశం నిర్వహించనున్నట్లు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఖండాపు గోవిందరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. ఆ పార్టీ ఆమదాలవలస నియోజకవర్గం సమన్వయకర్త చింతాడ రవికుమార్ ఆధ్వర్యంలో మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమానికి నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని కోరారు.

నరసన్నపేట: మండలంలో ఉర్లాంలోని సన్ ఫంక్షన్ హాల్‌లో బుధవారం బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీపై మండల స్థాయిలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తల సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఆరంగి మురళి, మాజీ జెడ్పీటీసీ చింతు రామారావులు ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ముఖ్య అతిథులుగా జిల్లా పార్టీ అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్, పోలాకి జెడ్పీటీసీ ధర్మాన కృష్ణ చైతన్యలు హాజరుకానున్నారని తెలిపారు. ప్రతీ పంచాయతీ నుంచి ముఖ్య కార్యకర్తలు, పార్టీ అనుబంధ సంఘాల ప్రతినిధులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఉదయం 9 గంటలకు హాజరవ్వాలని కోరారు.

కొత్తూరు: మండల కేంద్రంలోని ఒక ప్రైవేటు కల్యాణ మండపంలో గురువారం వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు మండల పార్టీ అధ్యక్షుడు గండివలస ఆనందరావు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షుడు చింతాడ సూర్యనారాయణలు తెలియజేశారు. సమావేశానికి పార్టీ కార్యకర్తలు, నాయకులు, వివిధ పదవుల్లో ఉన్నవారు హాజరవ్వాలని కోరారు. వారితో పాటు నేతలు అగతమూడి నాగేశ్వరరావు, యర్లంకి ధర్మారావు, సవర రమేష్, సేపన అశోక్ తదితరులు పాల్గొన్నారు.

విస్తృత స్థాయి సమావేశం నేడు

హిరమండలం: మండలంలోని ధనుపురం గ్రామంలో మండల స్థాయి వైఎస్సార్‌సీపీ విస్తృత స్థాయి సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఏవీ సురేష్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి వైఎస్సార్‌సీపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి హాజరుకానున్నట్లు తెలిపారు. సమావేశంలో మండలంలోని వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఏపీపీఎస్సీ పరీక్షలకు ఏర్పాట్లు

నరసన్నపేట: జిల్లాలో ఏపీపీఎస్సీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న జూనియర్ లెక్చరర్స్ పోస్టుల రాత పరీక్షకు పగడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు డీఆర్వో వెంకటేశ్వరరావు తెలియజేశారు. జిల్లాలో నాలుగు చోట్ల పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. స్థానిక కోర్ టెక్నాలజీలో మంగళవారం పరీక్షలను ప్రారంభించగా, సీసీ కెమెరాల పర్యవేక్షణ, అభ్యర్థుల బయోమెట్రిక్‌ను ఆయన పరిశీలించారు. ఈనెల 23వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయని వెల్లడించారు. ఈ సెంటర్‌లో రెండు సెషన్స్‌లో పరీక్షలు నిర్వహించారు. ఉదయం 148 మందికి 95 మంది హాజరు కాగా, 53 మంది గైర్హాజరయ్యారు. అలాగే సాయంత్రం సెషన్‌లో 72 మందికి 41 మంది హాజరవ్వగా, 31 మంది గైర్హాజరయ్యారని స్థానిక పరీక్షా కేంద్రం లైజినింగ్ ఆఫీసర్ రామకృష్ణ తెలిపారు.

పేకాటరాయుళ్ల అరెస్టు

హిరమండలం: ఎల్.ఎన్.పేట మండలంలోని కోవిలాం గ్రామ సమీపంలో పేకాట శిబిరంపై దాడిచేసి నలుగురిని అదుపులోకి తీసుకున్నామని సరుబుజ్జిలి ఎస్‌ఐ హైమావతి మంగళవారం తెలిపారు. కోవిలాం గ్రామ సమీపంలోని తడి చెత్త, పొడి చెత్త రేకుల షెడ్డులో కొందరు వ్యక్తులు పేకాట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి వద్ద నుంచి రూ.9,430ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

మధ్యవర్తిత్వాన్ని వినియోగించుకోవాలి



పొందూరు: అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న జడ్జి జ్యోత్స్న, న్యాయవాదులు



మాట్లాడుతున్న జూనియర్ సివిల్ జడ్జి రాణి

కొత్తూరు: హైకోర్టు ఆదేశాల మేరకు మధ్యవర్తులుగా ఎంపిక చేసిన న్యాయవాదులను కక్షిదారులు వినియోగించుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి కందికట్ల రాణి సూచించారు. మండల కేంద్రంలో మధ్యవర్తిత్వంపై ప్రజలకు మంగళవారం అవగాహన కల్పించారు. మధ్యవర్తిత్వాన్ని వినియోగించుకోవడం వలన విలువైన సమయం ఆదా అవుతుందని తెలియజేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు, న్యాయవాదులు పొల్లుణరావు, గేదెల సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.

పొందూరు: దేశంలోని పలు కోర్టుల్లో పేరుకుపోతున్న పెండింగ్ కేసుల సంఖ్యను తగ్గించడం కోసమే సుప్రీంకోర్టు మధ్యవర్తిత్వం – దేశం కోసం కార్యక్రమాన్ని తీసుకొచ్చిందని పొందూరు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి బి.జ్యోత్స్న అన్నారు. ఈ మేరకు మండల కేంద్రంలో అవగాహన ర్యాలీ మంగళవారం నిర్వహించారు. మధ్యవర్తిత్వం వలన కక్షిదారులకు కేసుల నుంచి విముక్తితో పాటు ఆర్థిక ఉపశమనం కలుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు కె.అశోక్, వై.బ్రహ్మాజీ, పి.రామ్మోహన్, కె.మంజుల, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

స్వయం ఉపాధి కోర్సులు వినియోగించుకోవాలి



ర్యాలీ చేపడుతున్న పాఠశాల విద్యార్థులు

కొత్తూరు: స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు నూతనంగా మంజూరైన వృత్తి విద్యా కోర్సులను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని హెచ్‌ఎం ఎ.గోవిందరావు సూచించారు. మంగళవారం ప్రపంచ యువ నైపుణ్య దినోత్సవం పురస్కరించుకొని కొత్తూరులో విద్యార్థులతో ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం మాట్లాడుతూ ఆటో మొబైల్, ఫుడ్ ప్రాసెసింగ్, ఎలక్ట్రానిక్స్ వృత్తివిద్యా కోర్సులు మంజూరైనట్లు వెల్లడించారు.

ఈ కోర్సులను ఈ ఏడాది నుంచి అమలు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వృత్తివిద్యా కోర్సుల ఉపాధ్యాయులు వి.దుర్గారావు, వరప్రసాదరావు, భరత్, ప్రశాంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

జ్వరాలపై అప్రమత్తంగా ఉండాలి

హిరమండలం: జ్వరాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో ఆర్.కాళీప్రసాద్ సూచించారు. డెంగీ మాసోత్సవాలు పురస్కరించుకొని మండలంలోని మన్మాన్‌గూడలో అవగాహన సదస్సు, ర్యాలీ మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీజనల్ వ్యాధులు అధికంగా వచ్చే అవకాశాలు ఉండడంతో జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. జ్వరం వస్తే నిర్లక్ష్యం చేయకుండా రక్త పరీక్షలు చేసుకోవాలని సూచించారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, పారిశుద్ధ్యానికి పెద్దపీట వేయాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో గోవిందరావు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



అవగాహన ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

బాధ్యతల స్వీకరణ



సారవకోట: మాట్లాడుతున్న సీడీపీవో అనురాధ



ఆమదాలవలస: కమిషనర్ రవికి అభినందనలు తెలుపుతున్న సిబ్బంది

ఆమదాలవలస: పురపాలక సంఘ కమిషనర్‌గా తమ్మినేని రవి మంగళవారం పదవీ బాధ్యతలు స్వీకరించారు. గతంలో మున్సిపల్ కమిషనర్‌గా విధులు నిర్వహించిన పూజారి బాలాజీ ప్రసాద్ జూన్ నెలలో పదవీ విరమణ పొందారు. దీంతో పురపాలక సంఘ ఏఈగా ఉన్న జాన్సన్ గత 15 రోజులుగా ఇన్‌చార్జి కమిషనర్‌గా బాధ్యతలు నిర్వహించారు. పురపాలక సంఘ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన రవి మాట్లాడుతూ ప్రజలకు మెరుగైన సేవలు అందిస్తామని తెలిపారు.

సీడీపీవోగా అనురాధ

సారవకోట: సారవకోట ఐసీడీఎస్ ప్రాజెక్టు సీడీపీవో(ఎఫ్ఏసీ) గా సారవకోట అనురాధ మంగళవారం విధుల్లో చేరారు. ఇదివరకు ఇక్కడ సీడీపీవోగా విధులు నిర్వర్తించిన హెచ్‌కే కామాక్షి గత నెలలో పదవీ విరమణ పొందారు. విధుల్లో చేరిన అనురాధ సెక్టార్ సూపర్‌వైజర్లతో సమావేశం నిర్వహించారు. సమావేశంలో సూపర్‌వైజర్లు సుజాత, సీతారత్నం, పద్మవతి, మనోహరి తదితరులు పాల్గొన్నారు.

వేర్వేరుగా చెత్త సేకరించాలి

హిరమండలం: తడి చెత్త, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించాలని ఎంపీడీవో కాళీప్రసాద్ సూచించారు. మంగళవారం హిరమండలం మేజర్ పంచాయతీ పరిధిలో పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా సిబ్బందికి పలు సూచనలు చేశారు. చెత్త నిర్వహణలో నిబంధనలు పాటించాలన్నారు. ప్రజలు కూడా తడి, పొడి చెత్తను వేర్వేరుగా అందించి సహకరించాలన్నారు. ఆయనతో పాటు డిప్యూటీ ఎంపీడీవో గోవిందరావు, ఈవో భాస్కరరావు తదితరులు ఉన్నారు.

బదిలీ ఉపాధ్యాయులకు సత్కారం

నరసన్నపేట: మండలంలోని దూకులపాడు యూపీ స్కూల్‌లో పనిచేస్తూ బదిలీపై వెళ్లిన నలుగురు ఉపాధ్యాయులను గ్రామస్తులు మంగళవారం సత్కరించారు. ఉపాధ్యాయులు అనిత, స్వప్న, దివాకర్, చిన్ని కృష్ణలకు సన్మానం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆరంగి మురళి, సర్పంచ్ అల్లు అసిరినాయుడులు, ఎంఈవో యు.శాంతారావు, సత్యవరం ఉన్నత పాఠశాల హెచ్‌ఎం వకులాదేవి తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

పాతపట్నం: పాతపట్నం సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ మరమ్మతులు, కొత్త విద్యుత్ లైన్లు పనులు చేపట్టనున్న కారణంగా బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని టెక్కలి విద్యుత్ శాఖ ఈఈ జి.శంకరరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు బైరాగిపేట, దశరథపురం, కొత్త చంగుడి తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

మత్తు పదార్థాలకు బానిస కావొద్దు

బూర్జ: యువత మత్తు పదార్థాలకు బానిస కావొద్దని ఆమదాలవలస సీఐ పి.సత్యనారాయణ సూచించారు. ఈ మేరకు స్థానిక ఎస్‌ఐ ఎం.ప్రవల్లిక ఆధ్వర్యంలో మండలంలోని పెద్దలంకాం గ్రామంలో మత్తు పదార్థాలతో వచ్చే అనర్థాలపై మంగళవారం అవగాహన కల్పించారు. అనంతరం సింగన్నపాలేం గ్రామంలో కార్డన్ సెర్చ్ నిర్వహించారు. ఎవరైనా దొంగ వాహనాలు అమ్మడం, పత్రాలు లేని వాహనాలు నడిపినా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. అక్రమంగా మద్యం అమ్మడం చేసినా చర్యలు తప్పవని హెచ్చరించారు. సింగన్నపాలేం గ్రామంలో మొత్తం 10 ద్విచక్ర వాహనాలు పట్టుకోవడం జరిగింది. కార్యక్రమంలో స్థానిక పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న ద్విచక్ర వాహనాలు

పెట్రోల్ బంక్ వద్ద ఆందోళన



పెట్రోల్‌కు బదులు నీళ్లు వచ్చాయని చూపుతున్న వినియోగదారుడు

నరసన్నపేట: స్థానిక కామేశ్వరి ఎంటర్‌ప్రైజెస్ పెట్రోల్ బంకులో పెట్రోల్‌కు బదులు నీళ్లు వస్తున్నాయని వినియోగదారులు మంగళవారం రాత్రి ఆందోళనకు దిగారు. సుమారు రెండు గంటలకుపైగా పెట్రోల్ బంకు వద్ద హడావుడి నెలకొంది. దూకులపాడుకు చెందిన కె.నీలయ్య రూ.550ల పెట్రోల్ కొట్టించగా, దీంట్లో కొంతవరకు నీళ్లు వచ్చాయి. వెంటనే ద్విచక్ర వాహనం సీజ్ అయింది. మెకానిక్ ఇచ్చిన సమాచారంతో పెట్రోల్ బంకు వద్ద సిబ్బందిని నీలయ్య ప్రశ్నించగా ఘర్షణ చోటుచేసుకుంది. చివరికి పోలీసులు వచ్చి గొడవను సద్దుమణిగించారు.